


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 12 సంచిక : 274 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 7 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :274 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 7 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## స్పేర్‌సిటీ.. భవిష్యత్ టెక్నాలజీకి వారధి

- మాస్కోలో వ్యాధి నిర్ధారణ చేసే ఏటీఎం... నారా లోకేష్ ఆశ్చర్యం
- మాస్కోలోని స్బేర్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్
- వ్యాధి నిర్ధారణ చేసే స్బేర్ బ్యాంక్ ఏటీఎంను పరిశీలన
- ఏఐ, క్వాంటం టెక్నాలజీపై ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రతినిధులు
- డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌పై ఆరా

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రష్యా రాజధాని మాస్కోలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్కడి ప్రతిష్టాత్మక స్బేర్ సిటీని సందర్శించి, ఆధునిక సాంకేతికతను పరిశీలించారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక

- మిగతా 2లో



## అసలు నువ్వెవరు?

### ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

- షూటింగ్‌లకు ప్రకాశ్ రాజ్ ఎప్పుడైనా సమయానికి వచ్చారా అని నిలదీత
- దేశానికి, తెలంగాణకు ఆయన చేసిన సేవ ఏంటని ఎద్దేవా
- గద్దర్ విషయంలో పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు లేదని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:నటుడు ప్రకాశ్ రాజ్‌పై తెలంగాణ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు ప్రకా శ్ రాజ్‌కు

- మిగతా 2లో

# సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం

## క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ

- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- తప్పులు చేసేవారిని వదిలించుకుంటానని హెచ్చరిక
- డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణిక మని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి

- మిగతా 2లో

## కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్

- కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు, రైతుల మోసపోయారన్న కన్నబాబు
- హామీలు నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా అని సవాల్
- గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని మండిపాటు



- మిగతా 2లో



## గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- రూ. 4.77 కోట్ల అభివృద్ధి పనులకు వెనిగండ్ల రాము శంకుస్థాపన
- ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడమే తమ ధ్యేయమని వ్యాఖ్య
- గతంలో నిర్లక్ష్యానికి గురైన పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడి

- మిగతా 2లో








# రుతుపవనాలు వచ్చేశాయి..

- ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- రాయలసీమ ప్రాంతాన్ని తొలుత తాకినట్లు ప్రకటించిన విపత్తుల నిర్వహణ సంస్థ
- ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- తరచూ విరామాలు తీసుకుంటూ రుతుపవనాల గమనం సాగే సూచనలు
- కొన్ని జిల్లాల్లో వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలకు అవకాశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. శనివారం రాయలసీమ ప్రాంతాన్ని రుతుపవనాలు తాకినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అధికారికంగా ప్రకటించింది. ఐఎండి అంచనాల ప్రకారం, త్వరలోనే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకూ విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రుతుపవనాల రాక కాస్త ఆలస్యమైంది. గత సంవత్సరం

- మిగతా 2లో

## బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం

### జంతర్ మంతర్‌లో అభిజిత్ దీప్కే

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ తొలి నిరసన
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఫలితాల అవకతవకలపై ఆందోళన




దేశవ్యాప్త విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై యువత గళమెత్తింది. సోషల్ మీడియా వేదికగా సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) శనివారం ఢిల్లీలోని

- మిగతా 2లో




## బెదిరింపులు వద్దు.. ప్రశ్నించడం మా హక్కు

పెన్ పవర్ డెస్క్:సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉంటారు ప్రకాశ్ రాజ్ . సామాజిక, రాజకీయ అంశాలపై తన అభిప్రాయా లను నిర్మొహమాటంగా వెల్లడిస్తుంటారు. తాజాగా జనసేన పార్టీ

- మిగతా 2లో

## తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త ముక్కలి వాసుదేవరావుకు అంతిమ వీడ్కోలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 6:** తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త ముక్కలి వాసుదేవరావు అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు జీకే వీధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళు లర్పించారు. అంత్యక్రియల్లో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొర్ర బలరాం, జీకే వీధి టిడిపి మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు, మాజీ జెడ్పీటిసి గంటా నళినీకృష్ణ, మాజీ టిడిపి జిల్లా కార్యదర్శి మహేష్,టీడీపీ నాయకులు పోతురాజు గోవింద్, మాడుగుల చంద్రిక, పోతురాజు కృష్ణారావు, శోభ జగన్, తగ్గి శారద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు వాసుదేవరావు పార్థివ దేహంపై పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. వాసుదేవరావును స్మరించుకుంటూ, పార్టీకి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఒక సీనియర్ కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అలాగే కుటుంబ పెద్దను కోల్పోయిన వాసుదేవరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ప్రాణాలను బలితీస్తున్న NH-516E పనులు

## భద్రతా నిబంధనల అమలులో నిర్లక్ష్యం.. వరుస ప్రమాదాలతో ఆందోళన





**జి.మాడుగుల. పెన్ పవర్.** అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-516ఇ పనులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో భద్రతా ప్రమాణాలను పక్కనపెట్టడం, సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, పనుల్లో ఉపయోగిస్తున్న వాహనాల స్థితిగతులను పట్టించుకోకపోవడం వల్ల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిర్మాణ పనుల్లో భద్రత ఎక్కడ?**

రహదారి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో గోతులు, మలుపులు, ప్రమాదకర ప్రాంతాల వద్ద తగిన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రాత్రి వేళల్లో లైటింగ్ వంటి కనీస భద్రతా ఏర్పాట్లు కనిపించడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఘాట్‌రోడ్లు, మలుపుల వద్ద నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**డొల్లతనం బయటపెడుతున్న నిర్మాణాలు**

రహదారి నిర్మాణ నాణ్యతపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల జి.మాడుగుల మండలం బండవీధి సమీపంలో కొత్తగా నిర్మించిన రక్షణ గోడలో పగుళ్లు కనిపించడం నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలకు తావిచ్చింది. విమర్శలు రావడంతో అధికారులు మరమ్మతులు చేపట్టినా, నాణ్యతపై సందేహాలు మాత్రం తొలగడం లేదు.

**కండీషన్ లేని వాహనాలే ప్రమాదాలకు కారణమా?**

పనుల్లో ఉపయోగిస్తున్న కొన్ని టిప్పర్లు, ట్యాంకర్లు, భారీ వాహనాలు సరిగా నిర్వహణ లేకుండా రోడ్లపైకి వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్లుగా అనుభవం తక్కువ ఉన్న స్థానిక యువకులను నియమించడం, వాహనాల సాంకేతిక స్థితిని తనిఖీ చేయకపోవడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని అంటున్నారు.

**కలవరపెడుతున్న ప్రమాదాలు**

ఇటీవలి కాలంలో జాతీయ రహదారి పనులకు సంబంధించి జరిగిన ప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

వంజరి ములక్కాయపుట్టు ఘాట్‌రోడ్డులో టిప్పర్ బ్రేకులు విఫలమై ఒకరు మృతి చెందారు.

బీరం పంచాయతీకి చెందిన రమణపై టిప్పర్ వెళ్లడంతో కాలు కోల్పోయాడు.

పాడేరు సమీపంలో గోతిలో జీపు పడటంతో ఒకరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.

బండవీధి వద్ద రాత్రి సమయంలో గోతిని గుర్తించలేక ద్విచక్రవాహనం ప్రమాదానికి గురై ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

ఇటీవల హైవేకు చెందిన టిప్పర్ స్కార్పియో వాహనాన్ని ఢీకొట్టడంతో వాహనం ధ్వంసమై పలువురు గాయపడ్డారు.

ఈ నెల 3న వంజరి వద్ద నీటి ట్యాంకర్ బోల్తాపడి ఓ గిరిజన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.

**ఉపాధి కోసం వెళ్లి మృత్యువాత**

రోజువారీ ఉపాధి కోసం హైవే పనుల్లో చేరిన కార్మికులు, డ్రైవర్లు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుండటం కుటుంబాలను విషాదంలోకి నెట్టేస్తోంది. కుటుంబానికి అండగా నిలవాల్సిన వారు మృత్యువాత పడటంతో బాధిత కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నాయి.

**చర్యలు ఎప్పుడు?**

ప్రమాదాలు జరిగినప్పుడల్లా తాత్కాలిక చర్యలు తీసుకోవడం తప్ప, మూల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రహదారి నిర్మాణ నాణ్యతపై స్వతంత్ర విచారణ చేపట్టాలని, కండీషన్ లేని వాహనాలను వెంటనే తొలగించాలని, ప్రతి నిర్మాణ ప్రాంతంలో కఠిన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

"అభివృద్ధి పేరుతో ప్రాణాలు బలికాకూడదు. రహదారి నిర్మాణం ఎంత ముఖ్యమో, ప్రజల ప్రాణ భద్రత అంతకంటే ముఖ్యమని అధికారులు గుర్తించాలి" అని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ హెచ్ డబ్ల్యుఓగా రత్నకుమారి

**రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 06.** రాష్ట్రస్థాయిలో ఉత్తమ హెచ్ డబ్ల్యుఓగా కూడ రత్నకుమారి ఎంపికవగా విజయవాడలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహ నివాస అధికారిణిగా కూడా రత్నాకుమారి విధులు నిర్వహిస్తున్నారు. ఆమె చేసిన సేవలకు గుర్తించిన ప్రభుత్వం ఆమెను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. అదే విధంగా ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులు కావటానికి రత్న కుమారియొక్క కృషి ఎంతో ఉంది. వసతి గృహంలో మెనూ అమలులో రాజీ పడకుండా విద్యార్థులకు చక్కటి మెనూ అందించడంలో ఎంతో కృషి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సర్వేలో అత్యధిక సంఖ్యలో రత్నకుమారి విధులపై సంతృప్తి వ్యక్తం చేయడంతో గిరిన సంక్షేమ శాఖ అధికారులు ఉత్తమ హెచ్ డబ్ల్యుఓగా రత్నాకుమారినీ ఎంపిక చేశారు. అన్ని విధాలుగా అర్హురాలుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేయడంతో ఉత్తమ అవార్డు దక్కింది. ఉత్తమ అవార్డు, ప్రశంస పత్రం అందుకున్న రత్నా కుమారికి కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, ఏటిడబ్ల్యు స్వర్ణలత, సహాచార హెచ్ డబ్ల్యుఓలు, పలువురు ఉపాధ్యాయులు, కుటుంబీకులు, అభినందనలు తెలిపారు.



## సుంకరమెట్ట తపాలా కేంద్రానికి సి పి ఎం జి సమీక్ష



**చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కు ఘన స్వాగతం పలికిన ఏపీఓ కిషోర్**

**అరకు లోయ పెన్ పవర్ 6:** అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో ఉన్న శాఖ తపాలా కార్యాలయం ను శనివారం ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ( సి పి ఎం జి ) బి పి శ్రీదేవి, విశాఖపట్నం రీజినల్ పోస్ట్ మాస్టర్ జనరల్ వి ఎస్ జయశంకర్ తో కలసి సందర్శించారు. అల్లూరి జిల్లా పర్యటనలో భాగంగా అరకలోయకు విచ్చేసిన ఆమె ముందుగా సుంకరమెట్ట శాఖాతపాల కార్యాలయమును సందర్శించి , అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు . అలాగే రికార్డులను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం సి పి ఎం జి అరకలోయకు చేరుకొని స్థానిక అక్షయ ఇన్ సమావేశ మందిరంలో పోస్టల్ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జి బి శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల ఆర్థిక శ్రేయస్సును కోరుతూ రిస్క్ లేని స్థిరమైన, ఆకర్షణీయమైన రాబిడి కోసం భారత ప్రభుత్వం ఇండియా పోస్ట్ ద్వారా అనేక చిన్న పొదుపు పథకాలను అందిస్తోందని తెలియజేశారు. వీటిలో 100 శాతం ప్రభుత్వ భద్రత ఉంటుందని చెప్పారు. సుకన్య సమృద్ధి యోజన , సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం, పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీమ్ , పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ , రికరింగ్ డిపాజిట్, ఎఫ్ డి , మహిళల కోసం ప్రత్యేకంగా అందిస్తున్న మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, పి ఎల్ ఐ తదితర పథకాల గురించి ఈ సందర్భంగా సిపిఎం జి వివరించారు . కాగా అరకులోయ పర్యటనలో భాగంగా సిపిఎంజి బి పి శ్రీదేవి కాసేపు దింస్సా కళాకారులు ప్రదర్శించిన దింస్సా నృత్యం లో పాల్గొన్నారు. అంతకుముందు సుంకరమెట్ట చేరుకున్న సి పి ఎం జి బిపి శ్రీదేవి, పోస్టుమాస్టర్ జనరల్ వి ఎస్ జయ శంకర్ లకు అనకాపల్లి ఎస్ పి ఓ చుక్క శ్రీనివాసరావు, అరకులోయ ఐపిఓ కిషోర్ తమ సిబ్బందితో కలిసి ఘన స్వాగతం పలికారు . ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు(CWSN)


**దివ్యాంగ పిల్లలకు అండగా ప్రభుత్వం సహాయ పరికరాలు, విద్యా కిట్ల, ఉచిత ఉపకారణాల పంపిణీ**

**జిల్లా కలెక్టర్ నిషాంతి. టి**

**పాడేరు, పెన్ పవర్,జూన్ 6:** జిల్లా ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగ) పిల్లల సమగ్ర వికాసానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి వెల్లడించారు. సమగ్ర శిక్షా అభియాన్ (ఇూాజ) ఆధ్వర్యంలో, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ సమన్వయంతో దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయ పరికరాలు 11 మండలాలకు సంబంధించి స్పెషల్ లీగల్లి రికగ్నైజడ్ డిసబిలిటీస్ కి, ఫిజికల్ డిసబిలిటీస్ వారికి 6మందికి, సెన్సరీ డిసబిలిటీస్ 4 మందికి, న్యూరో డెవలప్ మెంటల్ 3 మందికి, క్రోనిక్ న్యూరాజికల్ ఇద్దరు పిల్లలకు, బ్లైండ్ డిజార్డ్ ముగ్గురు పిల్లలకు, ఇతర కేటగిరీస్ వారికి ము 3, మొత్తం జిల్లాలో 185మందికి వివిధ రకాల ప్రత్యేక కిట్స్ అలాగే విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతులు మీదుగా పంపిణి నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి నెలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రత్యేకంగా మెడికల్ అసెస్మెంట్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులలో నిపుణులైన వైద్యుల ద్వారా ప్రతి బిడ్డను క్షుణ్ణంగా పరీక్షించి, వారికి ఎలాంటి పరికరాలు అవసరమనేది గుర్తిస్తామన్నారు.

వైద్యుల సిఫార్సుల మేరకు 'అలింకో' (ఋూా×వీజూ) సంస్థకు నివేదికలు పంపి, ప్రభుత్వం ద్వారా వీల్ చైర్స్, వాకింగ్ స్టిక్స్, జనరల్ ఎడ్యుకేషన్ కిట్లు మరియు అంధ విద్యార్థుల కోసం బ్రెయిలీ కిట్లను ఉచితంగా సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఈ రోజు లబ్ధిదారులైన పిల్లలందరికీ ఈ సహాయక సామగ్రిని అందజేశామని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, డి డి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి బి కె పరిమళ, సమగ్ర శిక్షాఅధికారి స్వామి నాయుడు, సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వరి విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోండి.


✷ సంతారి సచివాలయంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీచేసిన అరకు అసెంబ్లీ ఐ.టిడిపి అధ్యక్షులు జన్ని.వెంకటరమణ



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 6:** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం సంతారి సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రం లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వరివిత్తనాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు ఇందులో భాగంగా అరకు అసెంబ్లీ ఐటీడీపీ అధ్యక్షులు జన్ని.వెంకటరమణ హారులైన రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు ఒ పురుగుల మందు పంపిణీ చేశారు, రైతులు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగంచేసుకొని అధికదిబడిసాధించాలని ఆయన సూచించారు ఈ యొక్క కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది అగ్రికల్చర్ అసిస్టెంట్ మోహన్, డి.ఎ, గోవింద్ మాజీ కోపరేట్ డైరెక్టర్ టమకే నూకరాజు, పేసా సెక్రెటరీ బోయిని చిన్నయ్య, గ్రామస్తులు అర్హులైన రైతులు తదితరులు పాల్గొన్నారు

## చామగేడ్డలో విరగకాసిన పనస చెట్టు

✷ ఒకే చెట్టుకు వందలాది పనసకాయలు.. గ్రామస్థులను ఆకట్టుకుంటున్న అరుదైన దృశ్యం



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూన్ 6:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం చామగడ్డ గ్రామంలో ఓ పనస చెట్టు విరగకాసి స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చెట్టు మొదలు నుంచి కొమ్మల వరకు వందలాది(300పైన) పనసకాయలు కాసి అరుదైన దృశ్యంగా కనిపిస్తోంది.ప్రస్తుతం ఈ చెట్టు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. చెట్టుకు ఇంత భారీ స్థాయిలో పనసకాయలు కాయడం చాలా అరుదైన విషయమని గ్రామ పెద్దలు చెబుతున్నారు. చెట్టు నిండా పచ్చని పనసకాయలు వేలాడుతుండటంతో ప్రకృతి ప్రేమికులు, రైతులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ పనస చెట్టు ప్రతి ఏడాది మంచి దిగుబడిని ఇస్తున్నప్పటికీ, ఈసారి మాత్రం గతంలో ఎన్నడూ లేనంతగా కాయలు కాసిందని పేర్కొన్నారు. అనుకూల వాతావరణ పరిస్థితులు, చెట్టు ఆరోగ్యవంతంగా ఉండటమే ఇందుకు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.చెట్టుకు కాసిన పనసకాయలతో చామగడ్డ గ్రామంలో ప్రకృతి అందాలు మరింత ఇనుమడించాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ విరగకాసిన పనస చెట్టును చూసేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఆసక్తి చూపుతున్నారు.

## గ్రంథాలయాల్లో ఘనంగా ముగిసిన విజ్ఞాన శిబిర కార్యక్రమాలు



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6** : సంతబొమ్మాలి శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శనివారం గ్రంథాలయ అధికారి కె .రామకృష్ణ నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పిఎసిఎస్ అధ్యక్షులు కూ చెట్టి కాంతారావు ,కాంట్రాక్టర్ తంగి సింగమయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు చైతన్య, కృష్ణ, వెంకట్రావు సహాయకుల బాబురావు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలిలో : టెక్కలి గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమం లో ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు, సమ్మర్ క్యాంపు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి. రూపవతి, రిటైర్డ్ ఉపాధ్యాయులు గుజ్జు వెంకటరెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్ లు తమిళ్ వెంకటరావు, గున్న ప్రసాదరావులు,గవరయ్య, ఆర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం లో : నందిగాం గ్రంథాలయంలో కూడా శనివారం ముగింపు కార్యక్రమం లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్ ఉదయ్ కిరణ్ ,టిడిపి యువ నాయకులు కొన్ని సతీష్ కుమార్, ప్రదీప్ కుమార్, లోకేష్, బి మోహన్ రావు, సహాయకురాలు రాము లమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తమ్మ తల్లి సన్నిదిలో ఉచిత యోగా

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6 :** కోటబొమ్మాళి మండల కేంద్రంలోని శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 21 వరకు ప్రతీ రోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉచితంగా యోగా, మేడిటిషన్ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కార్యనిర్వాహోధికారి వాకచర్ల రాధాక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలతో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఆలయ కమిటి చైర్మన్ కోరాడ గోవిందరావు అధ్యక్షతన ప్రముఖ యోగా గురువులచే శిక్షణ ఇవ్వటం జరుగుతుందని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికలతో అధిక దిగుబడులు

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6 :** సొంతంగా తయారు చేసిన విత్తన గుళికల ద్వారానే ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందొచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీ.పీ.ఎం పూజారి సత్యన్నారాయణ ఆదేశాల మేరకు కోటబొమ్మాళి మండలం తర్లిపేట గ్రామంలో శనివారం సచివాలయ సిబ్బంది తో కలిసి విత్తన గుళికలు తయారుచేసి పొలాల్లో నాటారు. ఈ విదంగా నాటడం వలన కొద్దిపాటి వర్షానికి మొలకలు వచ్చి నేలను కప్పి ఉంచడం ద్వారా భూమిలో ఉన్న తేమను అలాగే సేంద్రియ కర్బనం ఆవిరి కాకుండా నివారించబడుతుందని వివరించారు. అలాగే విత్తన గుళికల్లో దీర్ఘకాలిక పంటలైన అనుములు, అలసందలు, గోరుచిక్కుడు, కందులు, ఆముదలు, సజ్జలు పై రకాల విత్తనాలు గుళికలుగా చేసి పొలం లో నాటడం జరిగిందన్నారు. గ్రామ రైతులు, వాడరేవు శ్రీనివాసరావు, కర్ణి భాస్కరరావు, బచ్చల రామస్వామి పై రైతుల పొలాల్లో విత్తన గుళికలు వేయడం జరిగిందన్నారు. ఈ విత్తనాలకు కొద్దిపాటి తేమ తోడైతే మొలకలు వచ్చి నేలను సంవత్సరం పాటు కప్పి ఉంచి ఆదాయం రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పొంక సింహాచలం ఎఫ్. ఎం. టి, ఐ. సి. ఆర్. పి లు దుంపల సూర్యం, బండి పద్మ, శిమ్మ రాధ, వరదు లత పాల్గొన్నారు.




## తల్లికి వందనం లబ్ధిదారులు నమోదు చేసుకోవాలి

ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 6:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద నిధులు త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న నేపథ్యంలో అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో బిహెచ్‌వీ రమణబాబు సూచించారు.ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ సమీప గ్రామ సచివాలయాలను సందర్శించి వెల్ఫేర్ అసిస్టెంట్ల వద్ద అవసరమైన నమోదు, ధ్రువీకరణ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా వెరిఫికేషన్ చేయించుకోని వారు ఆలస్యం చేయకుండా వెంటనే ధ్రువీకరణ చేయించుకోవాలని కోరారు.విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లల ఉన్నత విద్యకు తోడ్పాటు అందించాలని ఎంపీడీవో రమణబాబు పేర్కొన్నారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం గ్రామ సచివాలయాలను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ కళాశాల మైదానంలో సర్కస్ ఏర్పాటుకు అనుమతులా?



మండిపడుతున్న వాకర్సు, క్రీడాకారులు

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6** : టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని మినీ సర్కస్ నిర్వహణకు కేటాయించడం వివాదానికి దారితీసింది.. ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ మైదానాన్ని ప్రైవేటు సంస్థకు అప్పగించారని క్రీడాకారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపిస్తున్నారు. కళాశాల మైదానంలో సర్కస్ ఏర్పాటు చేస్తే వాకర్స్ తో పాటు క్రీడాకారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన క్రీడా మైదానాలలో ప్రైవేటు కార్యక్రమాలను నిర్వహించేందుకు అనుమతించవద్దని స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ఉన్నతాధికారులు గతంలో పలుమార్లు ఉత్తర్వులు జారీ చేసారు. ప్రభుత్వ కార్యక్రమాలకు మినహా ఇతరత్ర రాజకీయ సమావేశాలు, ఫంక్షన్లు ఇతరత్రా ప్రైవేటు కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితులలో కూడా అనుమతులు ఇవ్వద్దని వాటిలో స్పష్టం చేసారు. సాదారణ ప్రజలకు మాత్రం ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకోవడానికి , క్రీడాకారులు ఆటలాడుకునేందుకు మాత్రం అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతిస్తే చర్యలు తప్పవని ఆ ఉత్తర్వులలో స్పష్టం చేసారు. ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో సర్కస్ ఏర్పాటు కోసం ప్రిన్సిపాల్ తిరుపతి రావు అనుమతి ఇవ్వడం ఇప్పుడు దుమారం రేపుతుంది. దీనిపై వాకర్సు, క్రీడాకారులు, శిక్షకులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. సర్కస్ కి ఎలా అనుమతులు ఇచ్చారంటూ టెక్కలి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావును ప్రశ్నించగా ఆయన పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో క్రీడాకారులు, వాకర్స్ మండిపడుతున్నారు.


ఇప్పటికైనా సర్కస్ ఏర్పాటు కి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని శనివారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు విశ్రాంత ఆర్డీడీ రెయ్యి పున్నయ్య, శాసనపురి మార్కండేయులు, బాదన నారాయణరావు. నెట్టిమి లక్ష్మణరావు, సుంకు గోపీనాథ్, వై. ఊర్వరావు తదితరులు డిమాండ్ చేశారు. సర్కస్ కి ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేయాలని లేదంటే

కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వాకర్స్ హెచ్చరించారు.


## పబ్లిక్ ప్లేగ్రౌండ్ ఆక్రమణకు కూటమి నేతల ప్రయత్నం

బెంచీలు విరగగొట్టి, ప్రహరీ గోడ కూల్చి వేత

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6 :** సంతబొమ్మాలి మండలం దండుగోపాలపురంలో పబ్లిక్ ప్లే గ్రౌండ్ ఆక్రమణకు కూటమి నాయకులు శుక్రవారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే దండు గోపాలపురంలో పబ్లిక్ ప్లే గ్రౌండ్ కోసం గ్రామస్తులందరూ కొంత స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలంలో గ్రంథాలయం, ఆటస్థలం ,కళా మందిర్ ఏర్పాటు చేశారు. ఆ స్థలం చుట్టూ 1998లో ప్రహరీ గోడ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వడంతో నిర్మాణం చేపట్టారు. ఆ స్థలంపై స్థానిక అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. లీజు దస్తా ఒప్పందం పత్రాలను సృష్టించి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు ఉన్నప్పటికీ శుక్రవారం కూటమి నాయకులు 20 మంది వచ్చి ప్రహరీ గోడను కూల్చివేసి సిమెంట్ బెంచ్ లను విరగగొట్టారు. ఇది ఏమిటని ప్రశ్నించిన గ్రామస్తులపై దాడికి ప్రయత్నించారని గ్రామస్తులు తెలిపారు. అడ్డుకుంటే కేసులు పెడతామని బెదిరించారు. ఫిర్యాదు చేసినా కేసులు తప్పవని హెచ్చరించడంలో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై గ్రామస్తులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



## ఉత్తమ అభ్యుదయ రైతుగా తులసీదాస్




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6** నందిగాం మండలం బడగాం పంచాయతీ గనియాపేట గ్రామానికి చెందిన గరుడాచలం తులసీదాస్ ఉత్తమ అభ్యుదయ రైతుగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేం నియోజకవర్గం పరిధిలోని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారని ఆయన తెలిపారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బోలిశెట్టి శ్రీనివాస్, ఈసీ డా. కె.ధనుంజయరావు తదితరులు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ అవార్డును అందుకోవడం నాకు ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

## గుర్తు తెలియని మృత దేహంతో కలకలం




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6** : కోటబొమ్మాళి మండలం జాతీయ రహదారి చీపుర్లపాడు గ్రామం శ్రీపురం కూరగాయల మార్కెట్ సమీపంలో వంశదార ఎడమకాలువ గట్టు పై శనివారం గుర్తు తెలియని మృత దేహం తీవ్ర కలకలం రేపింది. సుమారు 35 నుంచి 40ఏళ్లు మధ్య వయసు కలిగిన పురుషుని గొర్రెల కాపర్ల కంటపడింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృ తదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోటబొమ్మాళి ప్రభుత్వ సామాజిక అసుపత్రికి తరలించారు. మృతుడు ముఖం పురుగులు పట్టి కుళ్లి పోవడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. కాఫీ రంగు రౌండ్ నెక్ టీషర్టు ధరించి, లైట్ కాపీ కలర్ కాటన్ జీన్స్ ఫ్యాంట్ ధరించి నలుపు రంగు బెల్టుతో టక్ చేసి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు 6309990861, 6309990817 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

## నాటిన ప్రతి మొక్కను మనమే రక్షించుకోవాలి




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6** : గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను గ్రామస్థులే వాటిని సంరక్షించుకోవాల్సిన భాద్యత ఉందని టిడిపి నాయకుడు సుంకరి గణపతిరావు అన్నారు. కోటబొమ్మాళి మండలం గంగరాం గ్రామంలో శనివారం ఆయన టిడిపి నేత సుంకరి రవికుమార్ అద్వర్యంలో చెరువు గుట్లుపై, రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటి వాటికి కంచెను ఏర్పాటు చేశారు. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని, ప్రతీ గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల, కాలువ గట్లు పై మొక్కలు నాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు చింతాడ లోకనాథం, సుంకరి అప్పన్న, రామారావు, వికాస్, మధులు ఉన్నారు.

## వడ దెబ్బకు వ్యక్తి మృతి




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 6** : సంతబొమ్మాలి మండలం మూలపేట గ్రామానికి చెందిన పరపటి శంకర్ (38) అనే వ్యక్తి వడదెబ్బకు శనివారం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే పోర్టు నిర్వాసిత గ్రామమైన మూలపేటకు నౌపడలో ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇల్లును కేటాయించారు. తన ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఎండ తీవ్రతకు అస్వస్థకు గురయ్యారు. దీంతో వాంతులు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య రాజు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




# బైకు దొంగల ముఠా అరెస్ట్

* 5 బైకులు స్వాధీనం, ముగ్గురు అరెస్ట్

**నర్సీపట్నం, పెన్ పవర్ (జూన్ 6) :**గ్రామీణ ప్రాంతాలలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను నాతవరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నర్సీపట్నం డి.ఎస్.పి పి.శ్రీనివాసరావు మీడియా ముందు ఉంచారు. శనివారం ఉదయం నాతవరం మండలం వెదురుపల్లి జంక్షన్ వద్ద ఎస్సై తారకేశ్వరరావు సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఒక బైక్ పై వస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వారిని ఆపే ప్రయత్నం చేయగా, పోలీసులను చూసి వారు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా మైదాన ప్రాంతంలో బైకులను దొంగిలించి, ఏజెన్సీలో తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. బైకులు అమ్మగా వచ్చిన సొమ్ముతో విలాసవంతమైన జీవితం గడపడమే కాకుండా, ఏజెన్సీలో గంజాయిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతంలో అమ్ముతున్నట్లు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో మాతిరెడ్డి మనోజ్, కిర్లంపల్లి సుబ్రహ్మణ్య కిరణ్, వంతల కొండబాబు ఉన్నారు. నిందితుల సమాచారం మేరకు దాచి ఉంచిన బైకులను స్వాధీనపరుచుకున్నారు. వీటి విలువ సుమారు నాలుగు లక్షల యాభై వేలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను, స్వాధీన పరుచుకున్న బైకులను మీడియా ముందు ఉంచారు.



నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన నాతవరం ఎస్సై తారకేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ మహేష్, గిరి, కృష్ణ లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారని డి.ఎస్.పి శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.

## రింతాడ పంచాయతీలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమం

* భూ హక్కులు, రికార్డులపై ప్రజలకు అవగాహన





**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూన్ 6:** రింతాడ గ్రామపంచాయతీ పరిధిలోని అరిటిచెట్లు వీధి, కొరపల్లి, కకారపాడు గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భూములకు సంబంధించిన హక్కులు, భూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులకు భూ హక్కుల పరిరక్షణ, రికార్డుల నవీకరణ, భూ వివాదాల పరిష్కార విధానాలపై అవగాహన కల్పించారు. రాజముద్ర కలిగిన భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రింతాడ పంచాయతీ ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్, జీకేవీధి మండల జనసేన అధ్యక్షుడు కొయ్యంబాలు, వీఆర్వో అశోక్, పిసా కార్యదర్శి జాన్ ప్రసాద్, గ్రామ పెద్దలు గెమ్మెల యేసుబాబు, లోత పెద్దబ్బాయి, నవీన్, వరుణ్, త్రినాథ్, ప్రసాద్ జనసేన పార్టీ నాయకులు పాంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను తెలుసుకోవడంతో కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.

## చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు నవచేతన కార్యక్రమం దోహదం

సీడీపీవో కె. బాలచంద్ర మణి దేవి




**జి.మాడుగుల. పెన్ పవర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపం, ఎదుగుదలలో జాప్యం వంటి సమస్యలను ముందుగానే గుర్తించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు నవచేతన కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని సీడీపీవో కె. బాలచంద్ర మణి దేవి తెలిపారు. స్థానికంగా నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, 0 నుంచి 3 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల ఆరోగ్య స్థితిని నవచేతన యాప్ ద్వారా పర్యవేక్షించే విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించామని చెప్పారు. చిన్నారుల్లో తొలి దశలోనే వ్యాధులు, పోషకాహార లోపాలు, ఎదుగుదలలో జాప్యం, పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి వైద్యుల సలహాలు పొందడం ద్వారా తగిన చికిత్స అందించవచ్చని తెలిపారు. అలాగే తల్లిదండ్రులకు సరైన మార్గదర్శకత్వం అందించి పిల్లల ఆరోగ్యాభివృద్ధికి తోడ్పడటం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నవచేతన యాప్ వినియోగంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించే అవకాశం కలుగుతుందని ఆమె వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నర్సీపట్నం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పీకర్ స్పష్టీకరణ



**నర్సీపట్నం, పెన్ పవర్ (జూన్ 6) :**నర్సీపట్నం 23వ వార్డు పాత బస్టాండ్ వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. నర్సీపట్నం టీడీపీ టౌన్ యూత్ అధ్యక్షుడు కటారి తాతబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి చింతకాయల పద్మావతి తమ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కేవలం 25 ఏళ్ల వయసులో, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని తనకు ఎన్టీఆర్ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చారని, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. సినిమా రంగంతో పాటు రాజకీయాల్లోనూ విశేషంగా రాణించిన ఏకైక నాయకుడు ఎన్టీ రామారావు అని, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, చదువు, ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం అందించిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని ప్రశంసించారు. ఇప్పటికీ ఆయనను ప్రజలు దేవుడిలా కొలుస్తూ విగ్రహాలు పెట్టుకోవడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

?నర్సీపట్నం అభివృద్ధిపై తనకున్న చిత్తశుద్ధిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. గత ఎన్నికల్లో మున్సిపాలిటీని కోల్పోయినా, నర్సీపట్నం అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేశానని తెలిపారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, స్పీకర్‌గా తనకున్న అనుభవంతో గత రెండేళ్లలో నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 319 పనుల కోసం 242 కోట్ల 66 లక్షల రూపాయల నిధులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం 185 కోట్ల రూపాయలతో జలాలను తరలించే ప్రాజెక్టును చేపట్టామని వివరించారు. అలాగే, స్థానిక ఆసుపత్రి అభివృద్ధికి 2 కోట్ల 63 లక్షల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీలో వార్డుల సంఖ్యను 28 నుంచి 40కి పెంచుతామని, దీనివల్ల ప్రతి వార్డుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తనకు రాజకీయ భవిష్యత్తునిచ్చిన నర్సీపట్నం ప్రజల రుణం తీర్చుకునేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రత్యేకించి 23వ వార్డు అభివృద్ధిపై ఆయన మాట్లాడుతూ, ఈ వార్డులో ఆరు పనుల కోసం 90 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఇందులో ప్రధానంగా కాలువ పక్కన రోడ్డు, సాయిబాబా గుడి వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణం వంటి పనులు ఉన్నాయని, వీటన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మిగిలిన పనులకు కూడా నిధులు మంజూరు చేసి వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, రాజేష్, మున్సిపాలిటీ టీడీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫేక్ పాస్టర్లను బహిష్కరిస్తాం





**మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో తీర్మానం**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 6:** మండల పాస్టర్స్ ఫెలోషిప్ అనుమతి లేకుండా గిరిజన గ్రామాల్లోకి మత బోధకులు రావద్దని పాస్టర్స్ సంఘం నాయకులు స్పష్టం చేశారు. శనివారం జీకే వీధిలో నిర్వహించిన మండల పాస్టర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ సంఘం జాతీయ సలహాదారు తిమోతి, మండల అధ్యక్షుడు యేసు రాజు మాట్లాడుతూ, ఇటీవల అభినయ్ దర్శన్ అనే వ్యక్తి తనపై దాడి జరిగిందని ప్రచారం చేసి, స్థానిక మత బోధకులకు ఇబ్బందులు కలిగించే పరిస్థితులు సృష్టించారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఇకపై మండల పాస్టర్స్ ఫెలోషిప్ అనుమతి లేకుండా ఎవరూ గిరిజన గ్రామాల్లో మత ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని, ఫేక్ పాస్టర్లను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పాస్టర్స్ జాతీయ నాయకులు పాస్టర్ వసుపరి తిమోతి, మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జి. యేసు రాజు, కోశాధికారి పాస్టర్ జి. జయరాజు, యూసీఎం నేతన్య చర్చ్ సూపర్వైజర్ పాస్టర్ వంతల పద్మాకర్ రావు, కార్యదర్శి పాస్టర్ ఇషాక్‌తో పాటు జీకేవీధి మండలానికి చెందిన వివిధ సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

## కార్యకర్త మెడికల్ ఖర్చులకు వాసుపల్లి రూ.5000 ఆర్థికసాయం

* ఇంటికి వెళ్లి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 06 :**వైసిపి కార్యకర్త మెడికల్ ఖర్చుల నిమిత్తం రూ.5000లు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్ఆ ర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆర్థిక సహాయం చేశారు,దక్షిణ నియోజకవర్గం 33 వ వార్డు అధ్యక్షుడు లిముత్తాబత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పత్తిరపల్లి రాము ద్వారా వాసుపల్లి గణేష్ కుమార్ విషయం తెలుసుకొని గోవింద రోడ్డు ప్రాంతంలో నివసిస్తున్న కార్యకర్త ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం అందించారు. గత ఎన్నికల సమయంలో జెండా తగిలి ఒక కన్ను పోయింది. ఇదే కార్యకర్త ఇప్పుడు ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఇంట్లోనే ఉండడంతో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారిందిలిఇటీవల శస్త్ర చికిత్స చేసుకోవడంతో మెడికల్ ఖర్చు లకు అవసరమైన కొంత నగదును వాసుపల్లి సొంత నిధులతో సాయం చేశారు. త్వరగా ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రతి కార్యకర్తకు కొండంత అండగా వైసిపి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలకు కార్యక ర్తలకు ఏ కష్టంలోనైనా తాను ముందు ఉంటా నని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం మళ్ళీ రావాలని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నా ఇటువంటి కరుడు కట్టిన ప్రేమ కలిగిన కార్యకర్తలు ఎంతోమంది ఎదురుచూస్తు న్న కళ నెరవేరుతుందని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ లింగం శ్రీను,జిల్లా జనరల్ సెక్రటరీ గనగల రామరా జు,సౌత్ సాంస్కృత భాగం ప్రెసిడెంట్ సూర్య నాయుడు, సౌత్ యూత్ ప్రెసిడెంట్ తాడి రవితేజ, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్,పత్తిరపల్లి ధర్మరావు, శివ రెడ్డి , పులి తదితరులు పాలుగున్నారు.

## రాజ్యసభకు జనసేన అభ్యర్థిగా లింగమనేని రమేష్ నామినేషన్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 6:** రాజ్యసభకు జనసేన పార్టీ అభ్యర్థిగా లింగమ నేని రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని రమేష్ పేరును జనసేన తరఫున ప్రతిపాదిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకిత భావంతో పనిచేస్తున్న లింగమనేని రమేష్ రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు సమర్థవంతంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభి వృద్ధి, ప్రజా సంక్షేమం, రాష్ట్ర హక్కుల సాధన కోసం రాజ్యసభ వేదికగా బలమైన స్వరాన్ని వినిపిస్తూ రాష్ట్రానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని లింగమనేని రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కొత్తవాడలో భూ హక్కు పత్రాల పంపిణీ




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 6:**మండలంలోని మొండిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తవాడ గ్రామంలో శనివారం భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన పట్టాదారులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు పాల్గొని భూ హక్కు పత్రాల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే, భూ హక్కుల కల్పన కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలమజ్జి, మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో, కూటమి నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు లక్ష్మణ్, రాజేష్, గ్రామ పెద్దలు, పట్టాదారులు తదితరులు పాల్గొన్నారు.ద

## చిన్నారుల వికాసానికి "నవ చేతన" కీలకం

- చిన్నారుల అభివృద్ధికి "నవచేతన"
- ముంచంగిపుట్టు సీడీపీఓ యు విమల కుమారి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 06.** చిన్నారుల వికాసానికి నవ చేతన కార్యక్రమం ఎంతో కీలకమని ముంచంగిపుట్టు మండల ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల1 లో సిడిపిఓ విమల కుమారి ఆధ్వర్యంలో నవ చేతన శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ.. చిన్నారుల అభివృద్ధికి నవ చేతన శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని, మొబైల్ ఆధారిత డిజిటల్ అభివృద్ధి స్క్రీనింగ్ విధానంగా రూపొందించిన నవచేతన ద్వారా పిల్లల జీవితంలోని తొలి వెయ్యి రోజుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలని లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి మరియు అభివృద్ధి స్క్రీనింగ్ పై శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నా లబ్బూరు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ శ్యామ్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. పిల్లల్లో అభివృద్ధి ఆలస్యాలను ముందుగానే గుర్తించి సరైన సమయంలో జోక్యం చేసుకునే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. మొదట కుప్పం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుని ఈ ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అదే విధంగా కిలగడ పీహెచ్సీ నుండి సిహెచ్ఓ స్వర్ణలత సౌరి ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో నవచేతన యాప్ ద్వారా పిల్లల స్థూల చలనాలు, సూక్ష్మ చలనాలు, భాషా నైపుణ్యాలు, జ్ఞానాత్మక సామర్థ్యాలు అలాగే సామాజిక భావోద్వేగ అభివృద్ధిని శాస్త్రీయంగా అంచనా వేయలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఇది ప్రామాణికృత డిజిటల్ స్క్రీనింగ్ సాధనంగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ లు ఎస్ కొండమ్మ. సిహెచ్ స్వర్ణ, ఎస్ రాజేశ్వరి, సిహెచ్ వరాహలమ్మ, కిలగడ పిహెచ్సి హెచ్ వి లక్ష్మి, 79 మంది అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


## యాంటి డ్రగ్ పార్క్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 06 :** యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించి, సన్మార్గంలో నడిపించే లక్ష్యంతో ప్రతిపాదించిన "యువగళం యాంటి డ్రగ్ పార్క్" నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ అధికారులను ఆదేశించారు.శనివారం విశాఖ సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న యాంటి డ్రగ్ పార్క్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. దేశం లోనే తొలిసారిగా ఒక ముఖ్యమైన సామాజిక అంశాన్ని కేంద్రంగా చేసుకుని ఈ పార్క్ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. యువతలో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై చైతన్యం కలిగించే విధంగా పార్క్ రూపుదిద్దుకోవాలని సూచించారు.పార్క్ నిర్మాణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ఆయన, పార్క్ కేవలం వినోదానికి మాత్రమే కాకుండా ప్రజల్లో అవగాహన పెంపొం దించే కేంద్రంగా ఉండాలని పేర్కొన్నారు. పార్క్ ఆవరణలో సోలార్ దీపాలను ఏర్పాటు చేయా లని సూచించారు.అదేవిధంగా ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు వీఎంఆర్డీఏ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న అన్ని పార్కుల్లో సోలార్ విద్యుత్ వినియోగంతో నెట్-జీరో విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించా రు.
ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఓఎస్డీ కృష్ణ నాయక్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, జేసీపీ సింగ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల పోషకాహార అవగాహనకు డిజిటల్ తోడ్పాటు



కేజీహెచ్లో ఫస్ట్ ఫుడ్స్ కేజీహెచ్ ఫీడ్ స్మార్ట్ కేజీహెచ్ ' యాప్ల ఆవిష్కరణ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 6 :** జాతీయ పూరక ఆహార దినోత్సవం సందర్భంగా పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు కింగ్ జార్జ్ ఆసుపత్రి -- ఆంధ్ర మెడికల్ కళాశాల పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన 'ఫస్ట్ ఫుడ్స్ కేజీహెచ్ ' మరియు "ఫీడ్ స్మార్ట్ కేజీహెచ్ డిజిటల్ యాప్లను శనివారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి పాల్గొని, ఈ యాప్ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి మరియు ఆయన బృందా న్ని అభినందించారు.ఈ సందర్భంగా డా. ఐ. వాణి మాట్లాడుతూ, శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, మెదడు అభివృద్ధి మరియు భవిష్యత్ ఆరోగ్యానికి సరైన పూరక ఆహారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరు నెలల వయస్సు తర్వాత పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి, ఎంత మోతాదులో ఇవ్వాలి, ఆహారంలో వైవి ధ్యం ఎలా ఉండాలి వంటి అంశాలపై తల్లిదండ్రు లకు సరైన మార్గదర్శకత్వం అవసరమని తెలిపారు. 'ఫస్ట్ ఫుడ్స్ కేజీహెచ్యాప్ ద్వారా 6 నెలల తర్వాత పూరక ఆహారం ప్రారంభించే విధానం, వయస్సుకు అనుగు ణమైన ఆహార సూచనలు, అలెర్జీ ఆహారాల పరిచయం, తాగునీటి వినియోగం, అనారోగ్య సమయంలో ఆహార నిర్వహణ, ప్రమాద సంకేతాలపై తెలుగు--ఆంగ్ల భాషల్లో సులభమైన సమాచారాన్ని అందిస్తున్నట్లు వివరించారు.
అలాగే ఫీడ్ స్మార్ట్ కేజీహెచ్' యాప్ 6 నుంచి 24 నెలల పిల్లలకు వ్యక్తిగత పూరక ఆహార మార్గదర్శిగా పనిచేస్తుందని చెప్పారు. ఇందులో వయస్సు ఆధారిత ఆహార సూచన లు, ఫుడ్ డైవర్సిటీ స్కోర్, అలెర్జీ హెచ్చరికలు, అనారోగ్య సమయంలో ఆహార సూచనలు, నివేదికలను వాట్సప్ కాపీ సేవ్ ప్రింట్ రూపాల్లో పంచుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.
ప్రిన్సిపాల్ డా. సంధ్యాదేవి మాట్లాడుతూ, ఈ యాప్లు వైద్యులు-- తల్లిదండ్రుల మధ్య సమాచార వారధిగా నిలుస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది మాత్రమే కాకుండా వైద్య విద్యార్థులకు కూడా ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభినందించారు.పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ, ఈ యా ప్లు వ్యాధుల నిర్ధారణ కోసం కాకుండా స్క్రీనింగ్ మరియు అవగాహన కోసం రూపొందించబడినవని స్పష్టం చేశారు. పిల్లలలో పోషకా హార లోపాలు, సరైన ఆహారపు అలవాట్ల లోపం, ఇతర ప్రమాద సంకేతాలను ముందు గానే గుర్తించి, అవసరమైనప్పుడు శిశు వైద్యుల ను సంప్రదించేందుకు ఇవి దోహదపడతాయని తెలిపారు.వినియోగదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలుగు, ఆంగ్ల భాషల్లో రూపొందించిన ఈ యాప్లలో డేటా భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. తల్లిదండ్రులు, ఆరోగ్య సేవాదారుల కు సరైన అవగాహన కల్పించి శిశు ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడమే వీటి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు డా. సత్యకుమా రి, డా. సత్యవాణి, డా. సందీప్, ఇతర అధ్యాప కులు, వైద్య విద్యార్థులు, స్టాఫ్ నర్సులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ర్యాలి కేశవస్వామిని దర్శించుకున్న త్రిపుర ప్రధాన న్యాయమూర్తి ఎం ఎస్ రామచంద్రరావు







పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఏ .అభిషేక్ రెడ్డి

**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 6:**కోనసీమ జిల్లాలోని ర్యాలి గ్రామంలో వెలసిన ప్రాచీన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి దేవస్థానాన్ని త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్. రామచంద్రరావు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఎ. అభిషేక్ రెడ్డి శనివారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఖండవల్లి సీతారామాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, న్యాయమూర్తులు భక్తిశ్రద్ధలతో సేవల్లో పాల్గొన్నారు. అనంతరం పాట్నా న్యాయమూర్తి ఏ అభిషేక్ రెడ్డి స్వామివారి అన్నదాన పథకానికి రూ.10,116లను విరాళంగా సమర్పించారు.అలాగే హైదరాబాద్ మహానగరానికి చెందిన తోలేటి ఉదయ్ కిరణ్-- శ్రీ సాయిరమ్య దంపతులు రూ.5,116లు, చిలకపాడు చిమ్మా నాగేశ్వరరావు--సుధ దంపతులు రూ.10,116లు అన్నదాన పథకం కోసం విరాళాలుగా అందజేశారు. ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అసిస్టెంట్ అధికారి వై. శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటాలను అందించి అతిథులను ఘనంగా సత్కరించారు.
భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుంటుండటంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల సహకారంతో అన్నదాన పథకం నిరంతరం కొనసాగుతుండటం విశేషమని ఆలయ అధికారులు తెలిపారు.

## సబ్సిడీ ఎరువుల పంపిణీ లో కొత్త విధానం:ఎం ఏ ఓ.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 6:** రైతులకు అందిస్తున్న సబ్సిడీ ఎరువుల పంపిణీలో కొత్త విధానం అమల్లోకి వచ్చిందని ఏలేశ్వరం మండల వ్యవసాయ అధికారి ఏవి రాజేష్ శనివారం ప్రకటించారు.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సబ్సిడీ ఎరువుల పంపిణీలో కొత్త విధానం ఎన్ ఎస్ ఎఫ్ ఎస్ (నేషనల్ ఫెర్టిలైజర్ సేల్ ఫ్రేమ్ వర్క్) అమలులోనికి వచ్చిందని ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నూతన సేల్స్ ఫ్రేమ్వర్క్ ప్రకారం, రైతులకు వారి భూమి విస్తీర్ణం , పంట రకాలను బట్టి అవసరమైన మేరకే సబ్సిడీ ఎరువులను కేటాయించనున్నారు. ముఖ్యంగా యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల దుర్వినియోగాన్ని, బ్లాక్ మార్కెటింగ్ను సమర్థవం తంగా అరికట్టడం , అర్హులైన ప్రతీ రైతుకు సకాలంలో స్టాక్ అందేలా చూడటం ఈ ఫ్రేమ్వర్క్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కొనుగోలు వివరాలన్నీ ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా డిజిటల్ రూపంలో పర్యవేక్షించ బడతాయన్నారు. ఎన్ ఎఫ్ ఎస్ యాప్ ను వినియోగించుకొని రైతులు తమకు అవసరమైన ఎరువులను స్వయంగా ఎంపిక చేసుకోవచ్చు. సమీప రిటైలర్ను ఎంచుకోవచ్చు. ఒకేసారి పలు రకాల ఎరువులను ఎంచుకునే సౌకర్యం, అందుబాటులో ఉన్న ఎరువుల లభ్యతను తెలుసుకోవచ్చు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా రైతులు ఎరువులు పొందవచ్చు అని తెలిపారు. మరిన్ని వివరాలకు మీ సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా సలహాలు సూచనలు పొందవచ్చని ఎంఏఓ తెలిపారు.

## శంఖవరం తహశీల్దార్ గా సూరిబాబు

**శంఖవరం పన్ పవర్ జూన్ 06 :**-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం నూతన తహశీల్దార్ గా మొసలి సూరిబాబు నియమితులయ్యారు. ప్రభుత్వం కాకినాడ జిల్లా పరిధిలో కొందరు రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు, మరికొందరికి సాధారణ బదిలీలు నిర్వహించింది. ఈ బదిలీల్లో తాళ్ళరేవు డిప్యూటి తహశీల్దార్ గా పనిచేస్తున్న మొసలి సూరిబాబు తహశీల్దార్గా పదోన్నతి పొందడంతో శంఖవరం తహశీల్దార్ గా నియమితులయ్యారు. గతంలో శంఖవరం తహశీల్దార్ కార్యాలయం టైపిస్టుగా పనిచేసిన శంఖవరం మండల ప్రజానికానికి సుపరిచితులే. ఇప్పటి వరకు శంఖవరం తహశీల్దార్ గా పనిచేస్తున్న అడ్డాల తాతారావు కాకినాడ ఆర్టీఓ కార్యాలయం పరిపాలన అధికారిగా బదిలీ అయ్యారు.

## జోన్-1లో 11మండలాలను తొలగిస్తే గిరి యువత భవిష్యత్తు అంధకారం



- 5వ షెడ్యూల్, 1/70, పెసా, ఎఫ్ఆర్ ఏ చట్టాల ఉల్లంఘనను ఆదివాసి కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.
- ప్రజా ప్రతినిధుల మౌనం ప్రశ్నార్థకం!
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదివాసి వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 06.** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 గిరిజన మండలాలను ప్రస్తుతం ఉన్న జోన్-× నుండి తొలగించి మరో జోన్లో కలిపే ఏ ప్రయత్నాన్నైనా గిరిజన సమాజం, కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదివాసి వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లోని సహజ వనరులు, ఖనిజ సంపద, అటవీ సంపద, జల వనరులను దేశ సమగ్ర అభివృద్ధికి, పరిశ్రమలకు, ప్రాజెక్టులకు వినియోగించుకుంటున్నారని, కానీ అదే భూముల్లో అదే అడవుల్లో పుట్టి పెరిగిన గిరిజనులకు మాత్రం ఉద్యోగ అవకాశాలు, విద్యా అవకాశాలు, రాజ్యాంగ హక్కులు దూరం చేయడం అత్యంత అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం, పంచాయతీరాజ్ పొడిగింపు చట్టం-1996 పెసా, అటవీహక్కుల చట్టం-2006 ఎఫ్ఆర్ఏ వంటి ప్రత్యేక చట్టాలు గిరిజనుల భూములు, జల-జంగల్-జమీన్ హక్కుల పరిరక్షణ కోసం స్వయం ప్రతిపత్తి కోసం అమలులో ఉన్నాయన్నారు. కానీ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు, జోన్ మార్పుల ప్రతిపాదనలు ఆ చట్టాల ఆత్మకు, స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో జోన్-×లో కొనసాగుతున్న కారణంగా అల్లూరి జిల్లాలోని వేలాది మంది గిరిజన యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకు ఉద్యోగాలు, రైల్వే, పోస్టల్, ఇతర కేంద్ర సంస్థల్లో స్థానిక రిజర్వేషన్ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. జోన్ మార్పు వల్ల ఈ రిజర్వేషన్లు రద్దయ్యి, గిరిజన యువత చదువుకున్నా సరే ఉద్యోగాలు లేకుండా రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాల్లో పోలవరం, హైడ్రో పవర్ ప్రాజెక్టులు, బాక్సైట్ మైనింగ్, ఇతర పరిశ్రమల పేరిట వేల ఎకరాల గిరిజన భూములు, అటవీభూములు ప్రభుత్వం లాక్కుంటున్నారనీ, గ్రామ సభల అనుమతి, పెసా చట్టం ప్రకారం తీసుకోవాల్సిన అనుమతులు పక్కనబెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. గిరిజనుల ఉద్యోగ హక్కులు, స్థానికత హక్కులు, భూ హక్కులు ప్రమాదంలో ఉన్న ఈ క్లిష్ట సమయంలో అల్లూరి జిల్లాకు చెందిన బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ప్రజాప్రతినిధులు, మంత్రులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గిరిజనుల ఇళ్లకు వెళ్లి ఓట్లు అడిగిన నాయకులు నేడు గిరిజన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నప్పుడు అసెంబ్లీలో, పార్లమెంట్లో ఎందుకు గొంతెత్తడం లేదని నిలదీశారు. కూటమి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని భారత ప్రభుత్వం వెంటనే స్పందించి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 గిరిజన మండలాలను యథాతథంగా జోన్-×లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గిరిజన యువత ఉద్యోగ అవకాశాలను, స్థానిక రిజర్వేషన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించవద్దని కోరారు. గిరిజనుల రాజ్యాంగ హక్కులు, స్థానికత హక్కులు, ఉద్యోగ రక్షణ, 1/70 చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టాల అమలు విషయంలో ఎలాంటి రాజీకి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తే, రాజ్యాంగబద్ధంగా గిరిజన ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గిరిజనుల హక్కులు, ఉద్యోగ అవకాశాలు, భూములు, సహజ వనరులను కాపాడుకోవడం కోసం గిరిజన ప్రజలందరూ కుల, మత, పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపు నిచ్చారు.

## మహిళా రక్షణ, హక్కులపై అవగాహన కార్యక్రమం, భారీ ర్యాలీ ..






**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 06:**మండల కేంద్రమైన అడ్డతీగలలో మహిళా భద్రత, వారి హక్కుల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో శనివారం భారీ ర్యాలీని నిర్వహించారు. స్థానిక పోలీస్ శాఖ మరియు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.వినోద్ మరియు అడ్డతీగల చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ) క్రాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ,సాగిన ఈ ప్రదర్శనలో మహిళా రక్షణకు సంబంధించిన నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అవగాహన కల్పించారు.

ఈ ర్యాలీలో సుమారు 50 మందికి పైగా అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక మహిళలు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఐ ఎం. గజేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళా భద్రత అనేది అత్యంత కీలకమైన అంశమని, ప్రతి మహిళా తమకు ఉన్న చట్టపరమైన హక్కుల గురించి కనీస అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

మహిళల రక్షణ కోసం మరియు వారి సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ రకాల చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లు మరియు ప్రభుత్వం చేస్తున్న నిరంతర కృషిని సీఐ ఈ సందర్భంగా వివరించారు. మహిళలకు ఎలాంటి కష్టం వచ్చినా, వేధింపులు ఎదురైనా అధైర్యపడకుండా తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని, అడ్డతీగల పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మహిళల రక్షణకు అండగా ఉంటుందని సీఐ గజేంద్ర కుమార్ భరోసా ఇచ్చారు, అనంతరం మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది మరియు గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అముదాలబండలో సబ్ రేషన్ డిపో ఏర్పాటుకు హామీ

- సివిల్ సప్లైస్ జిల్లా అధికారిని కలిసి వినతిపత్రం అందజేసిన కూటమి నాయకులు



**గంగవరం, పెన్ పవర్, జూన్ 6:**గంగవరం మండలం అముదాలబంద గ్రామంలో సబ్ రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు సివిల్ సప్లైస్ జిల్లా అధికారి విజయ్ భాస్కర్‌ను కోరారు. శనివారం కొత్తాడ గ్రామంలోని రేషన్ డిపోను తనిఖీ చేయడానికి వచ్చిన జిల్లా అధికారిని కలిసి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ డిపో లేక వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. గ్రామంలోనే సబ్ రేషన్ డిపో ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుంజం సిద్ధు, మాజీ సర్పంచ్ కారం పరమేష్ దొర, గ్రామ అధ్యక్షుడు కారం ప్రసాద్ దొర, బూత్ ఇన్‌చార్జి కారం రాజ్‌కుమార్ దొరతో పాటు గ్రామస్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సీనియర్ ఫోటోగ్రాఫర్ వెంకటేశ్వరరావు మృతి..



**అడ్డతీగల ,పెన్ పవర్, జూన్ 06:** అడ్డతీగల లో గత 4 నుండి 5 దశాబ్దాల మధ్య ఫోటోగ్రాఫర్ గా ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి సుపరిచితుడుగా, ప్రతి ఒక్కరి మన్నన లు పొందిన ఫోటో స్టూడియో వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన మృతి పట్ల ఏజెన్సీ ఫోటో స్టూడియో యూనియన్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ ప్రాంతంలో నాలుగు దశాబ్దాల పైబడి ఆయనతో వారికి ఉన్న పరిచయాలను పరిచయస్తులు నెమరు వేస్తున్నారు. గ్రామస్తులు ఆయనకు నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# అంగుళూరులో గ్యాస్ అక్రమ నిలవలను దాడి.

### పలు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు



**గోకవరం /దేవి పట్నం పెన్ పవర్ మార్చి 15 :**–ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం అక్రమ గ్యాస్ సిలిండర్లు విక్రయాలకు అడ్డగా మారింది అక్రమ వ్యాపారులు దొంగ మార్గంలో రీఫిలింగ్ చేస్తూ గిరిజన ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారు విషయం తెలిసిన విజిలెన్స్ అధికారులు దాడి చేసి భారీగా గ్యాస్ సిలిండర్లను ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న వ్యక్తులను దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దేవిపట్నం మండలం లో పూడిపల్లి పంచాయితీ అంగుళూరు గ్రామంలో గ్యాస్ అక్రమ విక్రయాలకు అడ్డాగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో సిలిండర్లు వ్యాపారం జోరుగా సాగుతోంది. పక్కా సమాచారంతో విజిలెన్స్ ఎస్పి రామ్ కుమార్ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్నా ఇంటి ( గొడౌన్ ) పై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో అంగుళూరు గ్రామానికి చెందిన అప్పన్నబాబు నుంచి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమ నిల్వలు ఉంచి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తూ అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. డొమెస్టిక్ సిలిండర్ నుంచి వాణిజ్య సిలిండర్లకు గ్యాస్ రీఫిల్లింగ్ చేసేందుకు అవసరమైన ఒక మోటారు , ఒక వెయింగ్ మిషన్ కూడా అక్రమార్కులు ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. యంత్రపరికరాలను కూడా అధికారులు పట్టుకున్నారు. అక్రమ గ్యాస్ సిలిండర్లు వ్యాపారం ఎన్నో రోజులుగా ఒక కుటీర పరిశ్రమలా నిర్వహిస్తూ నెలనెలా వేలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అక్రమ సిలిండర్లు వ్యాపారంపై అధికారులు ప్రత్యేక నిఘాపెట్టడంతో ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడడంతో అధికారులు కంగుతిన్నారు. ఈనేపథ్యంలో పక్కా సమాచారంతో షాప్ పై దాడి చేశారు. ఎస్ఐ షరీఫ్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎట్టకేలకు అక్రమ గోడౌన్ వ్యవహారం బయటపడడం మండలంలో చర్చనీయాంశమైంది. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ టి నాగ వెంకటరాజు, విజిలెన్స్ ఏజీ లక్ష్మీనారాయణ,ఆర్ ఐ బులక్ష్మి,వీఆర్వో సాలీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**బ్లాకులో రూ.2500 అమ్మకం:--**

యుద్ధం నేపథ్యంలో సిలిండర్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. గతంలో ఇంటి అవసరాల సిలిండర్ బ్లాకులో రూ.1200 ఉండేది. ఇప్పుడు అదే సిలిండర్ సుమారు రూ.2500 వరకు పెంచి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంతకాలంగా ఒక దేవపట్నంలోనే కాకుండా గోకవరం పరిసర ప్రాంతాలను కూడా ఈ అక్రమ గ్యాస్ సిలిండర్ల దండ భారీగానే నడిచినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. కస్టమర్లకు గ్యాస్ కావాలంటే ఓటిపి అంటూ ఫోన్ అంటూ సవాలక్ష కారణాలు చెప్పి ముప్పు తిప్పలు పెడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు బ్లాక్ లో ఏ విధమైన అనుమతులు లేకుండా విక్రయించడం చూస్తుంటే అధికారులు చిత్త శుద్ధిని ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా గోకవరం కోరుకొండ ప్రాంతాల్లో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి షాపులలో హోటల్లో గ్యాస్లు ఏ విధంగా వస్తున్నాయో వెలికి తీయాల్సిన బాధ్యత విజిలెన్స్ అధికారులపై ఉందని పలువురు కోరుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇలాగైతే రోగాలు రావా..?



**ఏలూరు జూన్ 6 పెన్ పవర్ :**గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపటిటవ్ట స్వచ్ఛాంధ్రగా మార్చాలన్న రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు.ఏలూరు మండలం మాదేపల్లి గ్రామంలో పరిశుభ్రత నానాటికీ క్షీణించి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.పట్టించుకోవాల్సి పంచాయితీ సిబ్బంది నామమాత్రంగా విధులు నిర్వహించడంతో ప్రజలు అవస్తలు పడుతున్నారు.గ్రామ పంచాయితీ కార్యాలయం పక్కవీధిలో పశువుల నీటి తొట్టేను నింపడానికి వాటర్ ప్లాంట్ నుండి నీటి తోట్టేకు పైపులైన్ వేశారు.దానికి అమర్చిన పైపులు నుండి నీరు లైకై తొట్లే చుట్టూ అపరిశుభ్రవాతావరణం నెలకొని మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోన్నా పంచాయితీ కార్యదర్శి అటువైపుగా కన్నెత్తి చూడడం లేదని ప్రజలు నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామంలోని సచివాలయానికి సమీపంలోని 83,84 నెంబర్ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న పెంటర్‌లో మురుగుకాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్ధాలు పేరుకుపోయి డ్రైన్‌లో మురుగు పారక అపరిశుభ్రవాతావరణాన్ని తలపిస్తోంది.అంగన్ వాడి నిర్వాహకులు పంచాయితీ కార్యదర్శికి విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామంలో ఎక్కడా అపరిశుభ్రత చోటు చేసుకున్న ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ కూడా వెదజల్లడం లేదని,సంభందిత పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకుని గ్రామంలో అపరిశుభ్రవాతావరణం లేకుండా పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి గ్రామంలో రోగాలు ప్రబల కుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై సంభందిత సచివాలయం కార్యదర్శి సాయిదుర్గ దృష్టికి తీసుకు వెళ్లడానికి రెండు సార్లు చెరవాణిలో ప్రయత్నించినా ఆమె అందుబాటులోకి రాలేదు

## అంగన్‌వాడీ చిన్నారులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ

### పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు బలమైన పునాది: సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి



**గంగవరం, పెన్ పవర్ జూన్ 6:**గంగవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గంగవరం సెక్టార్‌లో కొమరవరం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు సిద్ధమవుతున్న చిన్నారులకు శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గంగవరం సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని ఉత్తీర్ణత ధ్రువపత్రాలు పొందిన చిన్నారులకు ప్రత్యేక వస్త్రధారణతో సత్కారం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్ విద్యకు బలమైన పునాదిని వేస్తాయని అన్నారు. ఇన్నాళ్లు సాధారణ దుస్తుల్లో కనిపించిన చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో కనిపించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమం పిల్లలకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని, ఇది ఒక పండుగ వాతావరణాన్ని తలపించే సంతోషకరమైన రోజని పేర్కొన్నారు.పిల్లల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ లభిస్తుందని తెలిపారు. చిన్నారుల విద్యాభివృద్ధికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె. కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త సి.హెచ్. రామాయమ్మ, అక్కమ్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సహకార సంస్థ ద్వారా నాణ్యమైన సరుకుల పంపిణీ చేయాలి

### తంటికొండలో నూతన చౌక ధరల దుకాణం ప్రారంభించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి





**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, జూన్ 6 :**గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకులు నాణ్యతతో, పారదర్శకంగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అధికారులకు సూచించారు.

రాజవొమ్మంగి మండలం తంటికొండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల విక్రయశాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, కూటమి ప్రభుత్వం ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గతంలో మాదిరిగానే రేషన్ డిపోల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.గిరిజన సహకార సంస్థ ద్వారా సరఫరా చేసే అన్ని రకాల సరుకులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, లబ్ధిదారులకు సకాలంలో అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వేలిముద్రలు పడని పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు సరుకులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.మండలంలోని చీడిపాలెం, చిన్నయ్యపాలెం, గొబ్బిలమడుగు, కరుదేవుపాలెం, కె. మర్రిపాలెం, కె. వెలగలపాలెం, నెల్లిమెట్ల కాలనీ, రాజవొమ్మంగి-3 గ్రామాల్లో కూడా నూతన నిత్యావసర సరుకుల విక్రయశాలలను కూటమి నాయకులు, రెవెన్యూ మరియు జీసీసీ శాఖల ఆధ్వర్యంలో ప్రారంభించారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, పార్టీ నాయకులు గణజాల తాతారావు, ముప్పన సావిత్రి, సుబ్బలక్ష్మి, వూట చిన్నబాబు, బారంగి అనుదీప్, తహసీల్దార్ స్వామి, గ్రామ రెవెన్యూ అధికారులు ములవాడ భారతి, కనిగిరి ద్రాక్ష తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం






**బాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విమర్శలు**

**గంగవరం, పెన్ పవర్, జూన్ 6:**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి విమర్శించారు. గంగవరం మండల కేంద్రంలో వైసీపీ మండల కమిటీ అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు శనివారం నిర్వహించిన "బాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం, పాలనలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేసిందని ఆరోపించారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. ప్రజలు ఆశించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు కాకపోవడంతో రాష్ట్రంలో అసంతృప్తి పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడటం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ చేపడుతోందని ధనలక్ష్మి తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె అన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ బేబీ రత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, మండల మహిళా అధ్యక్షురాలు బండారు రామలక్ష్మి, యువజన విభాగ అధ్యక్షుడు ఈపి సతీష్, ఏడుకొండలు రాధాకృష్ణ ప్రభ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దర్భ గూడెం గ్రామ బిజెపి అధ్యక్షులుగా అలవాల సోమిరెడ్డి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 6;** దర్భ గూడెం గ్రామ బిజెపి అధ్యక్షులుగా అలవాల సోమిరెడ్డి ని నియమించినట్లు ఏలూరు జిల్లా బిజెపి కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ తెలిపారు. శనివారం జీలుగుమిల్లిలో బిజెపి మండల సమావేశంలో నిర్ణయించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. దర్భ గూడెం బిజెపి గ్రామ ఉపాధ్యక్షులుగా ఊక సూర్యచంద్రరావు నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కొండపల్లి ప్రసాద్, జీలుగుమిల్లి బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, బుగ్గల శివ తదితరులు పాల్గొన్నారు.

# సర్ లో టిడిపి సానుభూతి పరుల ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలి

**క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జి ల సదస్సులో ఎమ్మెల్యే గోరంట్ల**





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 6:** ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని 100శాతం విజయవంతం చేయాలనీ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపు నిచ్చారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్ లో . 'సర్' కార్యక్రమంపై క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జి లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14వ తేదీ వరకు జరిగే సర్ లో బూత్ లెవెల్ ఏజంట్స్ (బి ఎల్ ఏ) ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి ఓటర్ల జాబితాలో టిడిపి సానుభూతి పరుల ఓట్లు పోకుండా జాగ్రత్త వహించాలని, 90శాతం మ్యాపింగ్ దాటాలన్నారు. 2లక్షల 72వేల ఓటర్లతో రూరల్ నియోజకవర్గం రాష్ట్రంలో పెద్ద నియోజక వర్గంగా ఉందని, 267బూత్ లుండగా, 301 కి పెరుగు తున్నాయన్నారు. వలసల ఓట్లు , ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు కూడా నమోదయ్యేలా సర్ లో శ్రద్ధ వహించాలన్నారు. కూటమిలో ఉన్న జనసేన, బిజెపి శ్రేణులతో సమన్వయము చేసుకుని సర్ న్ని పక్కాగా విజయవంతం చేయాలన్నారు. మహానాడులో కొంతమూరు క్లస్టర్ మొదటి స్థానంలో నిలిచిందని రూ. 25వేలు, రెండవ స్థానం ధవళేశ్వరానికి రూ. 10 వేల ఇస్తున్నట్లు బహుమతి గోరంట్ల ప్రకటించారు. రెండేళ్లలోనూ రూరల్ నియోజక వర్గంలో రూ. 120 కోట్ల రూపాయల పనులు చేస్తున్నామని, జలజీవన్ మిషన్ నిధులు రూ. 194 కోట్ల ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం డి ఎస్ సి ఇస్తే, ఆసత్య ఆరోపణలతో ఉద్యోగాలు రానివాళ్లను రెచ్చగొడుతున్నారని గోరంట్ల ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్, ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర కార్యదర్శి మజ్జి పద్మావతి, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాదు, డైరెక్టర్లు మద్దా మణి, కర్రీ అప్పలస్వామి, అన్నందేవుల చంటి, నున్న కృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జిలు గంగిన హనుమంతరావు, తలారి మూర్తి, సావాడ శ్రీనివాసరెడ్డి, శీలం గోవిందు, రొంపిచర్ల ఆంటోనీ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, పిల్ల తనూజ, గంగిన జాహ్నవి, పత్తి మంగా, గ్రామ పార్టీల అధ్యక్షులు, వార్డు ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# జేగురుపాడు పంచాయతీ కార్యదర్శిగా ప్రకాష్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 6:**కడియం మండలం జేగురుపాడు గ్రామ పంచాయతీ గ్రేడ్-1 పంచాయతి డెవలప్మెంట్ ఆఫీసర్గా పివై ప్రకాష్ ను నియమించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తూ గ్రేడ్ 1 పదోన్నతిపై జేగురుపాడు లో నియమించారు. ఈ మేరకు కడియం ఎంపిడివో కె. రమేష్‌కు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. పిడిఓ గా పనిచేసే ఎ. శ్రీనివాసరావు కోరుకొండ మండలం డిప్యూటీ ఎంపిడివో గా పదోన్నతిపై వెళ్లిన సంగతి తెలిసిందే.

# మలేరియా నియంత్రణకు దోమల మందు పిచికారీ

**గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు**







**గంగవరం, పెన్ పవర్, జూన్ 6:**మలేరియా వ్యాధి నివారణకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పోలవరం జిల్లా మలేరియా శాఖ ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహం, ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ వసతి గృహంలో శుక్రవారం దోమల మందు పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి కె. భాస్కరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బందికి మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం, నీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన చర్యలపై వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు దోమల నివారణ చర్యలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యమని అధికారులు తెలిపారు. అధికారులు ఆశ్రమ వసతి గృహాల పరిసరాలను పరిశీలించి అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె. భాస్కరరావు, డీసీ చంటిబాబు, ప్రధానోపాధ్యాయురాలు జాన్సీరాణి, ఎస్‌యూఓ సూరిబాబు, ఎంపీహెచ్ఏ (పురుష), ఆశా కార్యకర్తలు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చైతన్య ఆసుపత్రి వద్ద రూ.4.50 లక్షలతో సీసీ డ్రైయిన్ కి శంకుస్థాపన- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్




**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూన్ 6:** నగరంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి డ్రెయినేజీ వ్యవస్థను బలోపేతం చేస్తూ వరద నీటి నిల్వలను నివారించే చర్యలను వేగవంతం చేస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక 38వ డివిజన్ పరిధిలోని లలితానగర్ చైతన్య ఆసుపత్రి సమీపంలో రూ. 4.50 లక్షల అంచనాతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ . లలితానగర్ ప్రాంతంలో డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ సీసీ డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 6 :**స్తానిక రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వేమగిరి పరమ హంస యోగానంద నేత్రాలయం సహకారంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలన్స్ లో కంప్యూటర్ విద్యార్థుల కు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు రామక్రిష్ణ మిషన్ కార్యదర్శి శ్రీమత్ స్వామి పరిజ్ఞేయా నంద జీ మహారాజ్ తెలియచేసారు . ఈ కంటి వైద్య శిబిరం లో పరమహంస యోగానంద నేత్రాలయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటి బాబు విద్యార్థులలో వచ్చే కంటి సమస్యలు , తీసుకోవలసిన జాగ్రత్తలు, చరవాణి వినియోగించే సమయం తగ్గించటం గురించి అవగాహన కలిగించారు , ఈ కంటి వైద్య శిబిరం లో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు . అవసరమైన విద్యార్థులకు తగ్గింపు ధరలో కళ్లజోళ్లు ఇవ్వనున్నారు . ఈ కార్యక్రమంలో పరమహంస యోగానంద నేత్రాలయ సిబ్బంది కరీం , మణికంఠ , సునీత ,రాజు పాల్గొన్నారు . రామక్రిష్ణ మిషన్ రాజమండ్రి సహాయ కార్యదర్శి శ్రీమత్ స్వామి సేవనంద జీ మహారాజ్ , వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్ లన్స్ సిబ్బంది వీర్రాజు , రామచంద్ర రావు , శ్రీనివాస్ , బసవరాజు కుమార్ , ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు

# ఖతార్‌లో నర్సింగ్ ఉద్యోగాల అవకాశాలు

- **జూన్ 9, 10 ల్లో ఖతార్ యాజమాన్యంతో ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు**
- **వి జి డి మురళి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 6:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతార్ దేశంలోని దోహా నగరంలో హోంకేర్ నర్స్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జి. మురళి శనివారం తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఖతార్‌కు చెందిన యాజమాన్యం ద్వారా నేరుగా ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు జూన్ 9, 10, తేదీలలో నిర్వహించనున్నాయని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించనున్నదని, అభ్యర్థులకు విదేశీ ఉపాధి అవకాశాన్ని నేరుగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ ఉద్యోగాలకు బిఎస్సి నర్సింగ్ లేదా జిఎన్ఎమ్ నర్సింగ్ అర్హతతో పాటు కనీసం 2 సంవత్సరాల పోస్ట్-రిజిస్ట్రేషన్ అనుభవం కలిగిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అభ్యర్థుల వయస్సు 21 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు.

ఎంపికైన అభ్యర్థులకు నెలకు 5,000 ఖతారీ రియాల్స్ (సుమారు రూ.1,30,000 పైగా) వేతనం లభించనుందని తెలిపారు. అదనంగా పన్ను రహిత వేతనం ,ఉచిత వసతి, వైద్య సదుపాయం, రవాణా, ఉచిత వీసా, విమాన టికెట్ ఖర్చులు యాజమాన్యం భరిస్తుందని వెల్లడించారు. ప్రతి సంవత్సరం 20 రోజుల సెలవు సౌకర్యం కూడా కల్పించబడుతుందన్నారు.

విదేశీ ఉద్యోగ అవకాశాల ద్వారా అభ్యర్థులకు అధిక ఆదాయం, అంతర్జాతీయ అనుభవం, మెరుగైన వృత్తి ప్రగతి , కుటుంబ ఆర్థికాభివృద్ధికి అవకాశం లభిస్తుందని తెలిపారు. నర్సింగ్ రంగంలో అనుభవం కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పాస్‌పోర్ట్, అనుభవ ధ్రువపత్రాలు, విద్యార్హత పత్రాలు, గుడ్ స్టాండింగ్ సర్టిఫికేట్ , గ్రాడ్యుయేషన్ అటెస్టేషన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. డేటాఫ్లో , ప్రోమెట్రిక్ పరీక్షలు తప్పనిసరిగా ఉండనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 08-06-2026 లోపు నైపుణ్యం పోర్టల్ ద్వారా నమోదు చేసుకొని తమ రిజ్యూమ్‌ను ఏ పి ఎస్ ఎస్ డి సి కు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు:

9988853335, 8712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని ఆయన కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com